సాక్షి
నాగర్‌కర్నూల్
గురువారం ׀ 26 ׀ జూన్ ׀ 2025



క్రీడా స్కూళ్లకు ఎంపికలు

క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశానికి బుధవారం ఎంపికలు నిర్వహించారు.

వివరాలు 8లో ▸



కిక్కిరిసిన కురుమూర్తి

కురుమూర్తిస్వామి ఆలయానికి బుధవారం భక్తులు తరలివచ్చారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.6 /20.9

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

స్థానిక పోరుకు లైన్‌క్లియర్

సెప్టెంబర్ నెలలోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు

- ఆలోపే ముగించేందుకు ప్రభుత్వం కసరత్తు
- ముందుగా పంచాయతీనా.. ప్రాదేశికమా అన్నదానిపై కొరవడిన స్పష్టత
- రాజకీయ పార్టీలు, ఆశావహుల్లో మొదలైన సందడి
- బీసీ రిజర్వేషన్ల అమలుపైనే ఉత్కంఠ



సాక్షి, నాగర్‌కర్నూల్: స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్న హైకోర్టు ఉత్తర్వులతో గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో ఎట్టకేలకు స్పష్టత వచ్చింది. ఇప్పటికే పంచాయతీ సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయ్యి 17 నెలల సమయం గడిచినా తిరిగి ఎన్నికలు నిర్వహించని నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లో సెప్టెంబర్ నెలలోగా ఎన్నికలు పూర్తిచేయాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో రానున్న రెండు, మూడు నెలల కాలంలోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో, ఆశావహుల్లో సందడి మొదలైంది.

పల్లెల్లో పడకేసిన పాలన..

గ్రామ పంచాయతీలకు 2019 జనవరిలో ఎన్నికలు జరగ్గా.. గతేడాది ఫిబ్రవరి 2 నాటికి పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. సుమారు ఏడాదిన్నర కాలంగా సర్పంచ్‌లు లేక గ్రామాల్లో పాలన బోసిపోయింది. సకాలంలో ఎన్నికలు చేపట్టకపోవడంతో కేంద్రం నుంచి వచ్చే నిధులు సైతం నిలిచిపోయి.. గ్రామాల్లో పెద్దగా అభివృద్ధి పనులు చోటుచేసుకోలేదు. చాలావరకు గ్రామాల్లో అత్యవసర పనులు మాత్రమే చేపట్టారు. ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్లు, డ్రెయినేజీ తదితర పనులు తప్పా మిగతా అభివృద్ధి పనులు, శాశ్వత సమస్యల పరిష్కారానికి చర్యలు కరువయ్యాయి. మేజర్ గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ సైతం అస్తవ్యస్తంగా తయారైంది. పాలకవర్గాలు లేకపోవడంతో వారి స్థానంలో నియమించిన ప్రత్యేకాధికారులు గ్రామాల్లో అడుగు పెట్టకపోవడంతో గ్రామాల్లో పరిపాలన మందగించింది. దీంతో పూర్తి భారం పంచాయతీ కార్యదర్శులపైనే పడటంతో వారు సైతం ఏమీ చేయలేక చేతులేత్తేస్తున్న పరిస్థితి తలెత్తుతోంది.

వేడెక్కిన రాజకీయాలు..

పంచాయతీ ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని కొన్ని నెలలుగా ఎదురుచూస్తున్న ఆశావహుల నిరీక్షణకు తెరపడింది. రెండు, మూడు నెలల్లోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనుండటంతో గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. సెప్టెంబర్ నెలలోగా ఎన్నికలు నిర్వహిస్తారన్న అంచనాలతో ఏర్పాట్లను సిద్ధం చేసుకుంటున్నారు.

వీడని సందిగ్ధం..

స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ లోగా నిర్వహించాలన్న హైకోర్టు తీర్పు నేపథ్యంలో ముందుగా ఏ ఎన్నికలు నిర్వహిస్తారన్నది ఆసక్తిగా మారింది. ముందుగా పంచాయతీ ఎన్నికలా.. లేక ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు చేపడుతారా.. అన్న దానిపై చర్చ మొదలైంది. అలాగే బీసీ రిజర్వేషన్లను 42 శాతం అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ దీనిపై పార్లమెంట్ ఆమోదం తెలపాల్సి ఉంది. దీంతో బీసీ రిజర్వేషన్ల అమలు సాధ్యమవుతుందా.. లేక పాత పద్ధతిలోనే నిర్వహిస్తారా.. అన్న దానిపై కూడా సందిగ్ధం నెలకొంది. ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీల జనాభా ప్రాతిపదికన మాత్రమే ఓటర్ల జాబితా అందుబాటులో ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కులగణన ద్వారా బీసీల జనాభా, ఓటర్ల డాటా కూడా అందుబాటులోకి వచ్చింది. ఒకవేళ బీసీ రిజర్వేషన్ల అమలుకు ఆమోదం లభిస్తే అదనంగా బీసీ జనాభా డేటా బేస్‌ను అనుసంధానం చేయాల్సి ఉంటుంది. ఇందుకు మరింత సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో పంచాయతీలు, వార్డుల వివరాలు

జిల్లా	పంచాయతీలు	వార్డులు
నాగర్‌కర్నూల్	461	4,140
మహబూబ్‌నగర్	441	3,838
నారాయణపేట	280	2,518
వనపర్తి	268	2,436
జోగుళాంబ గద్వాల	255	2,390

సీజనల్ వ్యాధులతో జరభద్రం

- డెంగీ, మలేరియా కేసులు పెరగకుండా పటిష్ట చర్యలు
- అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లావ్యాప్తంగా కొన్ని రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాల కారణంగా చలిగాలులు వీస్తుండడంతో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. వర్షాల కారణంగా ఇంటి పరిసరాలు, పాత టైర్లు, నీటి తొట్టిల్లో నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. దీంతో ప్రజలు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, వైరల్ ఫీవర్ తదితర వ్యాధుల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ప్రణాళిక ప్రకారం..

వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తూ గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాల్లో నేరుగా ప్రజల వద్దకు వెళ్లి ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. దోమల వ్యాప్తి పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు. గంబూషియా చేపలను సేకరించి గ్రామాల్లోని మురికి కుంటల్లో వదిలి దోమల వ్యాప్తిని అరికడుతున్నారు. ప్రజలు తప్పనిసరిగా మాస్కులు ధరించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు.

జిల్లాలో నమోదయిన కేసులు

జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేటలో 2024 సంవత్సరంలో 89 డెంగ్యూ, 3 చికన్‌గున్యా, 4 మలేరియా కేసులు నమోదయ్యాయి. 2025లో ఇప్పటి వరకు నలుగురు డెంగ్యూ బారిన పడగా.. చికన్‌గున్యా, మలేరియా కేసులు నమోదుకాలేదు.



లట్టుపల్లిలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు అవగాహన చర్యలు చేపడుతున్నాం. ఆరోగ్యకేంద్రాల వారీగా వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. కేసులు ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ వ్యాధుల బారిన పడకుండా ఉండాలి. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని పారిశుద్ధ్య, వైద్య సిబ్బందికి సహకరించాలి.

– డా.స్వరాజ్యలక్ష్మి, డీఎంహెచ్‌ఓ, నాగర్‌కర్నూల్

న్యూస్‌రీల్

రోగులకు అందుబాటులో మెరుగైన వైద్యం



లింగాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అదనపు వైద్యాధికారి తారాసింగ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం జిల్లా అదనపు వైద్యాధికారి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఆస్పత్రి తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోకి చేరడంతో త్వరలో అన్ని రకాల పోస్టులు భర్తీ అవుతాయన్నారు. దీంతో రోగులకు 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. త్వరలో సాధారణ కాన్పులు చేయడంతో పాటు ఆపరేషన్ థియేటర్‌ను కూడా ప్రారంభిస్తామన్నారు. మృతదేహాలకు ఇక్కడే పోస్టుమార్టం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రోగులు రూ.వేలు ఖర్చు పెట్టి ఆస్పత్రులకు వెళ్లొద్దని, సర్కార్ దవాఖానాలోనే అన్ని వసతులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

రేపు రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం

నాగర్‌కర్నూల్ క్రైం: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 27న జిల్లా కేంద్రంలోని ఎస్‌జేఆర్ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి రమేష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీలో శాశ్వత సభ్యత్వం కలిగిన సభ్యులతో పాటు ప్యాట్రన్, వైస్ ప్యాట్రన్ సభ్యత్వం కలిగిన వారు సమావేశానికి హాజరు కావాలని కోరారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ కలెక్టర్ సూచనలతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని తెలిపారు.

రేపు పాలెంలో పాలిసెట్ కౌన్సెలింగ్

బిజినేపల్లి: మండలంలోని పాలెం శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (ఏ)లో శుక్రవారం నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.రాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీ వరకు నిర్వహించే పాలిసెట్ కౌన్సెలింగ్‌కు వచ్చే విద్యార్థులు తమ వెంట ఒరిజినల్ టీసీ, పది, సమాన తరగతుల మెమోలు, బోనఫైడ్లు, ఆదాయం సర్టిఫికెట్, స్థానిక ధ్రువీకరణపత్రం ఆధార్‌కార్డు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తీసుకొని రావాలని సూచించారు. స్లాట్ బుకింగ్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 27, 28, 29 తేదీల్లో హాజరు కావాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కందనూలు: సాహస రంగంలో పాల్గొన్న వ్యక్తులను గుర్తించడానికి యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ టెంజింగ్ నార్వే నేషనల్ అడ్వెంజర్ అవార్డు–2024 ఎంపికకు http://awards.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా జిల్లాలోని యువత దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి సీతారాం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవార్డులు భూమిపై సాహసయాత్రలు, సముద్రంలో, ఆకాశంలో చేసే సాహస యాత్రలకు ఈ అవార్డు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు జూన్ 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

37 వాహనాలకు వేలం

తెలకపల్లి: మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం ఉదయం 11గంటలకు వివిధ కేసుల్లో పట్టుబడిన 37 వాహనాలకు సంబంధించిన వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ జనార్దన్ పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాలకు రూ.5వేలు, ఫోర్ వీలర్ వాహనాలకు రూ.20వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. వేలంలో వాహనం దక్కని వారికి వెంటనే డిపాజిట్ తిరిగి చెల్లిస్తామన్నారు.

కేంద్ర బీమా పథకాలను వినియోగించుకోవాలి

పాన్‌గల్: కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో దర్తీ ఆబా జన భాగీదారి అభియాన్‌లో భాగంగా ఇన్సూరెన్స్, పీఎం జనధన్ ఖాతాలు, సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమా తదితర వాటిపై తండా వాసులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవడంతో కుటుంబానికి కలిగే ప్రయోజనాలను వివరించి వారితో ప్రతిజ్ఞ చేయించారు.

మదనగోపాలస్వామి ఆలయాన్ని సుందరీకరిస్తాం

- పర్యాటకుల కోసం వసతుల ఏర్పాటు
- మంత్రి జూపల్లి కృష్ణారావు

పెంట్లవెల్లి: జటప్రోల్ గ్రామంలోని మదనగోపాలస్వామి ఆలయాన్ని సుందరీకరించి, భక్తులకు అన్ని వసతులు కల్పిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం మంత్రి స్పెషల్ పీఎస్ జయేష్ రంజన్, పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి జటప్రోల్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో ఉన్న పురాతన ఆలయాలు, కత్వ వాటర్ ఫాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జటప్రోల్ గ్రామాన్ని, ఆలయాన్ని అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రత్యేకంగా గదులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి సంవత్సరం నిర్వహించే మదనగోపాలస్వామి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలన్నారు.



ఆలయాన్ని సందర్శిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, వల్లూరు క్రాంతి

గ్రామ సమీపంలో ఉన్న కత్వ వాటర్‌ఫాల్స్‌ను వీక్షించేందుకు వచ్చే పర్యాటకుల కోసం సీసీ రోడ్డు వేయించాలని, రైతులకు ఉపయోపడే విధంగా చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోవింద్‌గౌడ్, నల్లపోతుల గోపాల్, భీంరెడ్డి, నాగిరెడ్డి, గుర్క ఆంజనేయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొండారెడ్డిపల్లి అభివృద్ధిలో వేగం పెంచండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, పక్కన కలెక్టర్ సంతోష్

వంగూరు: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అధికారులను ఆదేశించారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత కొండారెడ్డిపల్లిలోనే అంతర్గత విద్యుత్ లైన్ల ద్వారా విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే వంద శాతం సోలార్ విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కొండారెడ్డిపల్లిని రాష్ట్రంలోనే ఆదర్శగ్రామంగా నిలపాలని కోరారు. ఫోర్ లైన్స్ రోడ్డు, పాలశీతలీకరణ కేంద్రం పనులు పూర్తి చేయడంతో పాటు అండర్ డ్రెయినేజీ పనులు ప్రారంభించాలన్నారు.

నిధుల కొరత లేదు

కొండారెడ్డిపల్లితో పాటు అచ్చంపేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఎలాంటి నిధుల కొరత లేదని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సోదరుడు, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎనుముల కృష్ణారెడ్డి, వేమారెడ్డి, రాఘవేందర్, వంశీ, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారిగా దేవసహాయం

కొండారెడ్డిపల్లిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవసహాయాన్ని నియమించినట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. ఇక నుంచి గ్రామ అభివృద్ధిని మరింత వేగవంతం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

దంచికొట్టిన వాన..

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలో బుధవారం సాయంత్రం జోరువాన కురిసింది. జిల్లావ్యాప్తంగా పలుచోట్ల పత్తి విత్తనాలు వేసుకున్న రైతులు కొన్ని రోజులుగా వాన చినుకుల జాడ లేకపోవడంతో ఆందోళన చెందారు. బుధవారం కురిసిన వర్షం రైతులకు ఉపశమనం కలిగించగా, మరికొంత మంది రైతులు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. జిల్లాలో అత్యధికంగా వంగూరు మండలంలోని కిష్టంపల్లిలో 35.8 మి.మీ, ఊర్కొండ మండల కేంద్రంలో 31 మి.మీ వర్షం కురిసింది.

జిల్లాలో వర్షపాతం..

మండలం	వర్షపాతం (మి.మీ)
వంగూరు	35.8
ఊర్కొండ	31
నాగర్‌కర్నూల్	28.3
బిజినేపల్లి	22
కల్వకుర్తి	21
తాడూరు	18
వెల్దండ	17.8
లింగాల	17.8
ఉప్పునుంతల	14.8
కోడేరు	13.5
తెలకపల్లి	12
చారకొండ	10.5
అమ్రాబాద్	9.5
పెద్దకొత్తపల్లి	9.5

ఎమర్జెన్సీ పేరుతో ప్రజాస్వామ్యంపై దాడి!



కందనూలు: ఎమర్జెన్సీ పేరుతో అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యంపై దాడి చేసిందని బీజేపీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రశేఖర్ తివారీ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణకు బీజేపీ తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎమర్జెన్సీ కాలంలో ఇందిరాగాంధీ రాజ్యాంగాన్ని కాలరాశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల హక్కుల ను పాతాళానికి నొక్కడంతో పాటు మీడియా గొంతు నొక్కారని ఆరోపించారు. కోర్టులు సైతం బెదిరింపులకు లోనయ్యాయని, వేలాది మంది అమాయకులు జైలుశిక్ష అనుభవించారని నాటి రోజులను గుర్తుచేశారు. ఆ సమయంలో జనసంఘ్ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రయత్నం చేసిందన్నారు. అనంతరం ఎమర్జెన్సీ కాలంలో జరిగిన అరాచకాలపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రావు, పార్లమెంట్ అభ్యర్థి భరత్‌ప్రసాద్, జిల్లా ఇన్‌చార్జ్ మాదగాని శ్రీనివాస్‌గౌడ్, ప్రమోద్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, ఎల్లేని సుధాకర్‌రావు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్

బిజినేపల్లి: దేశ భవిష్యత్‌లో కీలకంగా వ్యవహరించే యువతపై చెడు ప్రభావం చూపిస్తున్న మాదకద్రవ్యాలను నిర్మూలించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్పీ గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్ అన్నారు. బుధవారం పాలెం వ్యవసాయ కళాశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మట్లాడుతూ.. మాదక ద్రవ్యాలకు బానిసయిన వారు సమాజం నుంచి తిరస్కరణకు గురవుతున్నారని, అంతేకాక శారీరక, మానసిక, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాలను సరఫరా చేసే వారి సమాచారం పోలీసు అధికారులకు తెలియజేస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు తాగుతున్నట్లు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇస్తే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, సాధారణ స్థితికి మారుస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డా.పుష్పావతి, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సత్యనారాయణ, సీఐ కనకయ్యగౌడ్, ఎస్‌ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

మా రూటే 'వేరు'

ఒకటే పార్టీ.. 2 సమావేశాలు

- గద్వాల కాంగ్రెస్‌లో అదే తీరు..
- మరోసారి వర్గ రాజకీయాలకు వేదికగా మారిన ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి భేటీ
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో..
- హరిత హోటల్‌లో సరిత వర్గంతో..
- చర్చనీయాంశంగా పరిశీలకుల తీరు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: గద్వాల అంటేనే గ్రూపు రాజకీయాలకు పెట్టింది పేరు. ఇది నిజమేనని మరోసారి రుజువైంది. పార్టీ ఒక్కటే.. సమావేశాలు మాత్రం రెండు చోట్ల జరిగాయి. బుధవారం జిల్లాకేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం గ్రూప్ రాజకీయాలకు వేదికగా మారింది. వచ్చిన పరిశీలకులకు సైతం ఒకింత ఇబ్బందిపడినట్లు సమాచారం.

భిన్నాభిప్రాయాలు..

కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత వర్గాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్ర పరిశీలకులు విశ్వనాథ్, దీపక్‌జాన్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ బుధవారం గద్వాలలో జరిగిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. అయితే గద్వాలలో ఉన్న రెండు గ్రూపులను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే బండ్లతో ఆయన క్యాంపు కార్యాలయంలో, సరిత వర్గంతో హరిత హోటల్‌లో సమావేశాలు నిర్వహించారు. అయితే పరిశీలకులే వేర్వేరుగా సమావేశాలు నిర్వహించడంపై పార్టీ శ్రేణుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వర్గ విభేదాలను ప్రోత్సహించేలా పరిశీలకులే వ్యవహరించారని ఓవైపు.. వేర్వేరుగా అయితేనే ఇరువర్గాల మధ్య రాజీ కుదుర్చడం సులువవుతుందని మరోవైపు పార్టీలో చర్చ జరుగుతోంది.

2, 3 రోజుల్లో శుభవార్త..

సరిత వర్గంతో భేటీ సందర్భంగా పార్టీలో ముందు నుంచి పనిచేసిన వారికి తప్పకుండా న్యాయం జరుగుతుందని, పార్టీ ఏ ఒక్క నాయకుడు, కార్యకర్తను వదులుకోదని ఏఐసీసీ కార్యదర్శి, రాష్ట్ర పరిశీలకుడు విశ్వనాథ్ అన్నారు. సరితకు రెండు, మూడు రోజుల్లో శుభవార్త వస్తుందని సైతం హామీ ఇచ్చినట్లు పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. కాగా.. బండ్ల, సరిత మధ్య బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగిన ఆధిపత్య పోరు కాంగ్రెస్‌లో సైతం కొనసాగుతుండటంపై పరిశీలకుల మధ్య హాట్‌హాట్‌గా చర్చ జరిగినట్లు పార్టీ శ్రేణులు గుసగుసలాడుతున్నాయి.

అన్యాయం అంటూ సరిత..



తాము పార్టీని నమ్ముకుని ముందు నుంచి కష్టపడి పనిచేస్తున్నామని.. కానీ, తమకు తీరని అన్యాయం జరుగుతోందని పరిశీలకుల ఎదుట సరిత ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీకి సంబంధించిన నామినేటెడ్ పదవులు మొదలుకొని.. ప్రభుత్వ శాఖలలో అన్ని రకాల పనుల వరకు తమకు భంగపాటు ఎదురవుతోందని వాపోయినట్లు తెలిసింది. ముఖ్యంగా నా వర్గం అని తెలుసుకుని పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలపై పోలీస్ కేసులు నమోదవుతున్నాయని, ప్రతిరోజు పోలీసులకు ఫోన్ చేయాల్సి వస్తోందని.. ఇలాంటి పరిస్థితి ప్రతిపక్ష పార్టీ నాయకులకు కూడా ఎదురుకాదని.. తనకు ఎలాంటి పదవులు అవసరం లేదని, పార్టీని నమ్ముకున్న వారికి న్యాయం చేయాలని గట్టిగా కోరినట్లు సమాచారం.

సీఎం సహకారంతో ముందుకు



తనకు న్యాయం జరిగిందని, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి సహకారంతో ముందుకు వెళ్తున్నట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. 30 సంవత్సరాలకు పైగా రాజకీయాల్లో ఉన్నానని, పార్టీ అభివృద్ధికి అన్ని రకాలుగా సహకారమందిస్తానని చెప్పినట్లు తెలిసింది.

బీఆర్‌ఎస్ వాళ్లకే పనులు

మాజీ మున్సిపల్ చైర్మన్ కేశవ్ మాట్లాడుతూ పేరుకు అధికార పార్టీ నాయకులమే కానీ.. పనులన్నీ బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులకే జరుగుతున్నాయని బాహాటంగానే ఆరోపించినట్లు తెలిసింది. పరిశీలకులు ఇది వరకే రెండు సార్లు వచ్చారని.. ఇది మూడోసారని.. అయినా నిజమైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి న్యాయం జరగడం లేదని పరిశీలకులకు ఉదాహరణలతో వివరించినట్లు సమాచారం.

చేతి వృత్తుల ఉత్పత్తుల ప్రదర్శన

వనపర్తి: హైదరాబాద్‌లోని సచివాలయం సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం పక్కన మైదానంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో కుమ్మరి, చేనేత, మేదరి, వడ్రంగి, పూసల తదితర వృత్తి కళాకారులు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం ఈ నెల 29 వరకు కొనసాగుతుందని జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి ఆర్.ఇందిర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు పాల్గొని ఉత్పత్తులు కొనుగోలు చేసి బీసీ కళాకారులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

ఏసీబీకి పట్టుబడిన ఎస్‌ఐ–2

- భూ వివాదంలో స్టేషన్ బెయిల్ కోసం డబ్బులు డిమాండ్
- పోలీస్‌స్టేషన్ ఆవరణలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు

– కల్వకుర్తి టౌన్

– వివరాలు 8లో..

క్లుప్తంగా

చున్నీతో ఉరేసుకొని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

మద్దూరు/కొత్తపల్లి: అనుమానాస్పద స్థితిలో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొత్తపల్లి మండలంలోని తుపాకీ తండాలో మంగళవారం జరిగింది. తండావాసులు, ఎస్ఐ కథనం మేరకు.. తండాకు చెందిన కేతవత్ సురేశ్ (18) నాగర్‌కర్నూల్ జిల్లాలోని వెల్దండ మండలంలోని ఏకలవ్య పాఠశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. మూడు రోజుల క్రితం పాఠశాల నుంచి ధ్రువీకరణ పత్రాలను తీసుకొని తండాకు వచ్చాడు. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఊయల కొండికి చున్నితో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పొలానికి వెళ్లిన తాత సాయంత్రం తిరిగొచ్చి చూసేసరికి మనువడు మరణించి ఉండడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. తండ్రి కేతావత్ లింబ్యానాయక్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. తమ కుమారుడు కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులను అడిగితే విద్యార్థికి ఇంటర్‌లో 900కి పైగా మార్కులు వచ్చాయని, ఎంసెట్‌లో 7వేల ర్యాంకు వచ్చిందని తెలిపారు. సురేశ్ మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ట్రాక్టర్ స్టీరింగ్ తగిలి వ్యక్తి మృతి

అయిజ: పొలం దున్నడానికి ట్రాక్టర్ తీసుకొని వెళ్లిన డ్రైవర్ బోయ ఈరన్న మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని కుటుకనూరులో చోటు చేసుకుంది. ఈరన్న పొలం దున్నుతుండగా.. నాగలికి రాయి తగలడంతో ట్రాక్టర్ కుదుపునకు గురయ్యింది. ఈ క్రమంలో స్టీరింగ్ ఈరన్న ఛాతీ భాగంలో బలంగా తగలడంతో అపస్మారక స్థితిలోకి చేరిన ఆయనను ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య అనుమానాస్పద మృతిగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసి, కుటుంబ సభ్యులకు అందజేశారు.

బాలిక కిడ్నాప్: కేసు నమోదు

తిమ్మాజిపేట: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన యువకుడితో పాటు సహకరించిన మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మార్చాలకు చెందిన జావీద్ అనే యువకుడు నాగర్‌కర్నూల్‌లో వాళ్ల అక్క ఇంట్లో ఉండేవాడు. ఈ క్రమంలో మే 28న గ్రామానికి వచ్చి మైనర్ బాలికను తన బైక్‌పై తీసుకెళ్లాడు. అతడి మిత్రులు గయాస్, ఎండీ యూసుఫ్ సహకారంతో హైదరాబాద్‌లో ఒక రూంలో బాలికను బంధించి అత్యాచారం చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ముగ్గురు నిందితులను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

తాతయ్యను పరామర్శించి వస్తుండగా..

వెల్దండ: మండలంలోని పోషమ్మగడ్డతండాకు చెందిన మైనర్ బాలికను మంగళవారం నగారగడ్డతండాకు చెందిన వెంకటేష్ అనే యువకుడు కిడ్నాప్ చేసినట్లు బాధితురాలి తల్లి చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. వివరాలు ఇలా.. బాలిక హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న తన తాతయ్య పరామర్శించి, తిరిగి గ్రామానికి చేరుకోవడానికి బస్సు ఎక్కింది. కానీ ఇంటికి రాకపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంకటేష్ కిడ్నాప్ చేసినట్లు అనుమానం వ్యక్తం చేస్తూ వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ ఘటన.. రైతులకు బెయిల్ మంజూరు

రాజోళి: మండలంలోని పెద్ద ధన్వాడ గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఘటనలో పలువురు రైతులపై కేసులు నమోదైన సంగతి తెలిసిందే. కాగా ఈ ఘటనలో 40 మందిపై కేసు నమోదు కాగా కోర్టు 12 మందికి రిమాండ్ విధించింది. వారికి ఈ నెల 19న బెయిల్ మంజూరైంది. మిగిలిన వారిలో మరో 13 మందికి బుధవారం ముందస్తు బెయిల్ మంజూరైంది. కాగా ముందస్తు బెయిల్ వచ్చిన వారు శాంతినగర్ పోలీస్ స్టేషన్‌లో సీఐకి ముందస్తు బెయిల్ పేపర్లను అందించారు. ఈ మేరకు వారికి షరతులతో కూడిన బెయిల్ అందినట్లు సీఐ టాటాబాబు తెలిపారు. కాగా ఈ కేసులో ఇప్పటి వరకు 26 మందికి బెయిల్ మంజూరు కాగా మిగిలిన వారికి బెయిల్ రావాల్సి ఉంది.

రిమాండ్‌కు తరలింపు

కేటీదొడ్డి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల బాలికపై లైంగిక దాడి ప్రయత్నించిన ఘటనలో నిందితుడిని కేటీదొడ్డి పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 23న ఇంటి వద్ద ఉన్న బాలికను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మాయమాటలు చెప్పి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అనంతరం బాలిక శరీరంపై చేతులు వేసి అనుచితంగా ప్రవర్తించడంతో అటుగా వెళ్తున్న స్థానికులు విషయాన్ని గుర్తించి అక్కడికి వెళ్లడంతో పారిపోయాడు. బాలిక కుటుంబ సభ్యులు ఈ నెల 24న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

క్రీడా స్కూళ్లకు ఎంపికలు



నాగర్‌కర్నూల్‌లో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్

- నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాస్థాయిలో పూర్తి
- నేడు పాలమూరు, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో..
- వచ్చేనెలలో రాష్ట్రస్థాయిలో ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రంలోని మూడు ప్రాంతీయ క్రీడా పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశాలకు జిల్లాస్థాయిలో సెలక్షన్స్ సందడి నెలకొంది. త్వరలో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి సెలక్షన్స్ జరగనున్నాయి. మేడ్చల్ జిల్లాలోని టీజీజీఎస్ఎస్ హకీంపేటతోపాటు కరీంనగర్, ఆదిలాబాద్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలల్లో 2025–26 సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రతి స్కూల్‌లో 4వ తరగతిలో 20మంది బాలుర, 20మంది బాలికలను ఎంపిక చేస్తారు.

ఉమ్మడి జిల్లాలో సందడి

ఉమ్మడి జిల్లాలో జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ సందడి నెలకొంది. నాగర్‌కర్నూల్ పట్టణంలో మంగళవారం, వనపర్తి పట్టణంలో బుధవారం జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ నిర్వహించారు. గురువారం మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లా కేంద్రాల్లో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైనవారు వచ్చేనెలలో జరిగే రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌కు వెళ్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచినవారు ఆయా స్పోర్ట్స్ స్కూళ్లలో 4వ తరగతిలో ప్రవేశాలు పొందుతారు. గతేడాది ఉమ్మడి జిల్లా నుంచి 29మంది విద్యార్థులు ఆయా స్పోర్ట్స్ స్కూళ్లలో 4వ తరగతిలో ప్రవేశాలు పొందగా.. నారాయణపేట జిల్లా నుంచి అధికంగా 14మంది ఎంపిక కావడం విశేషం.



మహబూబ్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు సెలక్షన్స్‌కు ఏర్పాట్లు

జిల్లాస్థాయి సెలక్షన్స్‌కు ఏర్పాట్లు



మహబూబ్‌నగర్ మెయిన్ స్టేడియంలో నేడు జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్స్ ఎంపికలకు ఏర్పాట్లు చేశాం. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు సెలక్షన్స్‌లో పాల్గొనాలి. సంబంధిత ధ్రువపత్రాలతో ఉదయం 8 గంటలకు మెయిన్ స్టేడియంలో రిపోర్టు చేయాలి. మిగతా వివరాలకు 9440656162 నెంబర్‌ను సంప్రదించాలి.

– శ్రీనివాస్, జిల్లా యువజన, క్రీడల అధికారి, మహబూబ్‌నగర్

స్పోర్ట్స్ స్కూళ్లతో ఉజ్వల భవిష్యత్



స్పోర్ట్స్ స్కూళ్లకు ఎంపికైనవారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. విద్యార్థులను ఇటు చదువుతోపాటు అటు క్రీడాంశాల్లో ప్రత్యేక శిక్షణ అందజేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొనేలా తీర్చిదిద్దుతారు. ఈ ఏడాది జిల్లా నుంచి ఎక్కువ మంది విద్యార్థులు స్పోర్ట్స్ స్కూళ్లకు ఎంపికకావాలని ఆకాంక్షిస్తున్న.

– వేణుగోపాల్, సీనియర్ పీడీ చిన్నదర్పల్లి, మహబూబ్‌నగర్

కావాల్సిన ధ్రువపత్రాలు

స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల ఎంపికలకు విద్యార్థులు పలు ధ్రువీకరణ పత్రాలతో రావాలి. ఒరిజినల్ ఆధార్‌కార్డు, 4వ తరగతి చదువుతున్న సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం (పాఠశాల నుంచి తహసీల్దార్/మున్సిపాలిటీ), 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, కమ్యూనిటీ సర్టిఫికెట్, పది పాస్‌ఫొటోలు, విద్యార్థులు 8నుంచి 9ఏళ్ల మధ్య వయస్సు ఉండాలి. 01.09.2016 నుంచి 31.08.2017 మధ్య పుట్టినవారు అర్హులు.

శారీరక సామర్థ్య పరీక్షలు

- విద్యార్థులకు వివిధ అంశాల్లో శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తారు.
- ఎత్తు, బరువు, 30మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800మీటర్ల, 610 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్ త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్.

జూరాలకు పెరిగిన వరద ఉధృతి

13 క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల



దిగువకు పారుతున్న వరద

ధరూరు: ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వస్తున్న వరద మరింత పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం 43 వేల క్యూసెక్కులు ఉండగా.. బుధవారం సాయంత్రానికి 92 వేల క్యూసెక్కులకు చేరిందని వివరించారు. దీంతో 13 క్రస్ట్ గేట్లు పైకెత్తి 51,779 క్యూసెక్కుల నీటిని దిగువకు వదుతున్నామన్నారు. విద్యుదుత్పత్తికి 32,169 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్ట్–1కు 650, ఆవిరి రూపంలో 44, ఎడమ కాల్వకు 550, కుడి కాల్వకు 298, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.010 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

లక్ష్యానికి మించి విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో మొదటిసారి జూన్ 25 నాటికి 125 మి.యూ. ఉత్పత్తి సాధించామని.. ప్రాజెక్టు చరిత్రలో మొదటిసారని జెన్‌కో సీఈ కల్లూరి రామసుబ్బారెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాలను సందర్శించి సిబ్బందిని అభినందించి మాట్లాడారు. ఈ ఏడాది 610 మి.యూ. లక్ష్యానికి మించి ఉత్పత్తి చేపట్టాలని అధికారులకు సూచించారు. మూడో యూనిట్‌లో సాంకేతిక లోపం గురించి విద్యుదుత్పత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 30 నాటికి మూడో యూనిట్ మరమ్మతు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొస్తామని చెప్పారు. కర్ణాటక నుంచి వరద భారీగా చేరుతుండటంతో జూరాల జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి వేగవంతంగా కొనసాగుతుందని వివరించారు. బుధవారం ఎగువ 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 58.687 మి.యూ, దిగువ 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 66.961 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈలు శ్రీధర్, సురేష్, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈలు పవన్‌కుమార్, రూపేష్, రాజు, ధర్మారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, దర్బార్‌వలీ, ఏఈలు పాల్గొన్నారు.




దిగువ జూరాల పవర్‌హౌజ్ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న సీఈ రామసుబ్బారెడ్డి

రామన్‌పాడులో 1,019 అడుగులు..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం సముద్ర మట్టానికి పైన 1,021 అడుగులకుగాను బుధవారం 1,019 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 700 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 45, వివిధ ఎత్తిపోతల పథకాలకు 873, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు వివరించారు.

శ్రీశైలం జలాశయానికి 85,087 క్యూసెక్కులు..

దోమలపెంట: జూరాలలో బుధవారం ఆనకట్ట గేట్లు పైకెత్తి 51,597 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 32,156, సుంకేసుల నుంచి 1,334 క్యూసెక్కులు మొత్తం 85,087 క్యూసెక్కుల ప్రవాహం శ్రీశైలం జలాశయం చేరుతోంది. ప్రస్తుతం జలాశయంలో 860.2 అడుగుల నీటిమట్టం, 106.6764 టీఎంసీల నీటి నిల్వ ఉంది. రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 318 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



శ్రీశైలం జలాశయం

ఉమ్మడి జిల్లాలో డీపీఎంలు బదిలీ

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇలా..

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
గోరటి లక్ష్మయ్య	నాగర్‌కర్నూల్	మహబూబ్‌నగర్
ఎం.రాము	నారాయణపేట	మహబూబ్‌నగర్
భాషా	వనపర్తి	నాగర్‌కర్నూల్
రాంమూర్తి	వికారాబాద్	మహబూబ్‌నగర్
శ్రీనివాస్	నాగర్‌కర్నూల్	మహబూబ్‌నగర్
సుధాకర్	నాగర్‌కర్నూల్	రంగారెడ్డి
నర్సింహులు	నాగర్‌కర్నూల్	రంగారెడ్డి
నాగమల్లిక	మహబూబ్‌నగర్	వనపర్తి
రాంమూర్తి	గద్వాల	మహబూబ్‌నగర్
అరుణదేవి	నాగర్‌కర్నూల్	మహబూబ్‌నగర్
జయన్న	నారాయణపేట	గద్వాల
వెంకటేశం	నాగర్‌కర్నూల్	సంగారెడ్డి
కె.అరుణమ్మ	వనపర్తి	గద్వాల
ఆనందం	నారాయణపేట	వనపర్తి
గోవిందు	సూర్యాపేట	నారాయణపేట
కృష్ణయ్య	మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్
వి.దామోదర్	మహబూబ్‌నగర్	సెర్ప్ హైదరాబాద్
చెన్నయ్య	మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్
సలోమి	మహబూబ్‌నగర్	గద్వాల

విధుల్లో ఐదేళ్లు పైబడిన వారికి స్థానచలనం

నారాయణపేట: మహాత్మ జ్యోతిబాపూలే ప్రజాభవన్ హైదరాబాద్‌లో బుధవారం సెర్ప్ సీఈఓ దేవరాజన్ సమక్షంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో సెర్ప్ ఉద్యోగులుగా ఎల్–4 క్యాడర్‌లో పనిచేస్తున్న డీపీఎంలకు రాష్ట్రవ్యాప్తంగా బదిలీలు చేపట్టారు. ఈ మేరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో డీపీఎంలు బదిలీ అయ్యారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వారిలో ఐదేళ్లు పైబడిన వారందరినీ బదిలీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే వీరంతా ఈ నెలాఖరు వరకు సంబంధిత జిల్లాల్లోని పెండింగ్ ఫైల్స్, రికార్డులను అన్ని సరిచేసుకొని పెట్టుకోవాలని సీఈఓ సూచించినట్లు సమాచారం. జూలై 1 నుంచి కేటాయించిన జిల్లాల్లో రిపోర్టు చేయాలని ఆదేశించినట్లు తెలిసింది.

భూ తగాదా.. మీసేవ సెంటర్ నిర్వాహకుడి అరెస్ట్

భూత్పూర్: పట్టణంలోని సుగుణ కమ్యూనికేషన్ పేరుతో మీ సేవ సెంటర్ నిర్వహిస్తున్న ప్రవీణ్ కుమార్‌తో పాటు అందులో పని చేస్తున్న భాస్కర్‌ను బుధవారం ఉదయం షాద్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. గతేడాది ఆగస్టు 6న రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలంలోని చిలకమర్రికి చెందిన ఓ రైతు తన పొలాన్ని వేరొక వ్యక్తికి జీపీఏ చేశారు. ఈ క్రమంలో జీపీఏ హోల్డర్ మీ సేవకు వచ్చి ఈకేవైసీ చేయించుకున్నాడు. ఈ విషయమై పోలీసులు ప్రవీణ్‌కుమార్‌ను వివరాలు అడగగా గతంలో ఓ వ్యక్తి వచ్చి ఈకేవైసీ చేయించుకొని వెళ్లాడని, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) కోసం మీ సేవ, ఏ ఇంటర్నెట్ సెంటర్‌లోనైనా డాక్యుమెంట్, తదితర వివరాలను అప్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపాడు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకున్న నంబరు ఆధారంగా మీసేవ సెంటర్‌లో రూ.35 చెల్లించి ఈకేవైసీ చేయిస్తే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్లు అన్ని తహసీల్దార్ లాగిన్‌లోకి వస్తాయని తెలిపారు. తద్వారా తహసీల్దార్ వెరీఫై చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వీలవుతుందని ప్రవీణ్ పేర్కొన్నాడు. భూమి కొనుగోలు చేసిన వ్యక్తి, సంబంధిత అధికారులకు మాత్రమే ఇందులో సంబంధం ఉందని తాను ఎలాంటి మోసానికి పాల్పడలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఏసీబీకి పట్టుబడిన ఎస్ఐ-2

- భూ వివాదంలో స్టేషన్ బెయిల్ కోసం డబ్బులు డిమాండ్
- కల్వకుర్తి పోలీస్‌స్టేషన్ ఆవరణలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు

కల్వకుర్తి టౌన్: భూ తగాదాల విషయంలో స్టేషన్ బెయిల్ కోసం రూ.10 వేలు లంచం తీసుకుంటున్న ఎస్ఐ–2ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోని గుండూరు గ్రామానికి చెందిన నంబి ఆంజనేయులు, నంబి వెంకటయ్యలకు మధ్య భూమి విషయమై కొన్నేళ్లుగా వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 23న భూమిని దున్నే సమయంలో ఇద్దరూ ఘర్షణ పడ్డారు. ఈ విషయమై ఇద్దరూ పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు వెంకటయ్యపై కేసు నమోదు చేశారు. దీంతో వెంకటయ్యను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఈ కేసులో స్టేషన్ బెయిల్ వస్తుందని చెప్పి అతనితో రూ.20 వేలు లంచం ఇవ్వాలని ఎస్ఐ–2 రామచందర్‌జీ డిమాండ్ చేయగా.. రూ.10 వేలకు ఒప్పందం చేసుకున్నారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా.. వారి సూచన మేరకు బుధవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎస్ఐ–2 రామచందర్‌జీపై కేసు నమోదు చేశామని, గురువారం నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు. ఇదే విషయమై బాధితుడు సైతం మీడియాతో మాట్లాడుతూ కేసు నమోదు చేసిన వెంటనే స్టేషన్‌కు పిలిపించి తన తప్పు లేకున్నా అసభ్య పదజాలంతో దూషించడమే గాక, డబ్బులు డిమాండ్ చేయడంతోనే ఏసీబీని ఆశ్రయించానని చెప్పారు. నిత్యం ఏసీబీ దాడులు జరుగుతున్నా అధికారుల్లో మార్పు రావడం లేదని, ఎవరైనా ప్రభుత్వ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తే ఏసీబీని ఆశ్రయించాలని డీఎస్పీ బాలకృష్ణ కోరారు. పట్టుబడిన ఎస్ఐ రామచందర్‌జీకి ఏడాది మాత్రమే సర్వీసు ఉందని అధికారులు పేర్కొన్నారు.



ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఎస్ఐ-2 రామచందర్‌జీ

కిక్కిరిసిన కురుమూర్తిగిరులు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

- అమావాస్య సందర్భంగా భారీగా తరలివచ్చిన భక్తులు
- మార్మోగిన గోవింద నామస్మరణ

చిన్నచింతకుంట: అమావాస్య సందర్భంగా అమ్మాపురం కురుమూర్తిస్వామి ఆలయానికి బుధవారం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి సుప్రభాత సేవ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు ఉదయం నుంచే క్యూలైన్‌లో నిల్చొని స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు మెట్లపై దీపాలు వెలిగిస్తూ కొబ్బరి కాయలు కొట్టి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ దిగువన మట్టికుండలో పచ్చిపులుసు, అన్నం తయారు చేసి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. కొండపైన అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి, ఉద్దాల మండపం వద్ద భక్తుల రద్దీ కనిపించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు బాద వెంకటేశ్వర్లు, భారతమ్మ, భాస్కర్ తగిన ఏర్పాట్లు చేశారు.

- అమ్మాపురం సంస్థానదీశులు శ్రీరాంభూపాల్ స్వామివారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను కోరారు.



దర్శనానికి బారులు తీరిన భక్తులు



రాజగోపురం వద్ద దీపాలు వెలిగిస్తూ..

చిన్నారిని చిదిమేసిన లారీ

- రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల బాలిక దుర్మరణం
- తల్లిదండ్రులకు తీవ్ర గాయాలు


దుద్యాల్/కోస్గి రూరల్: లారీ, స్కూటీ ఢీకొన్న ఘటనలో ఓ చిన్నారి అక్కడికక్కడే మృతిచెందగా తల్లిదండ్రులు తీవ్రంగా గాయపడిన ఘటన వికారాబాద్ జిల్లా దుద్యాల్ గేట్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ యాదగిరి, ప్రత్యక్షుల కథనం మేరకు.. నారాయణపేట జిల్లా కోస్గికి చెందిన అనిత, వెంకటేశ్ దంపతులకు మూడేళ్ల కుమార్తె అక్షిత ఉంది. వెంకటేశ్ కోస్గిలో కారు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఉదయం బ్యాంకు రుణం నిమిత్తం ముగ్గురు కలిసి స్కూటీపై కొడంగల్‌కు బయలుదేరారు. అదే సమయంలో తాండూరు నుంచి సిమెంట్ లోడ్‌తో మహబూబ్‌నగర్ వెళ్తున్న లారీ దుద్యాల్ గేట్ సమీపంలో ముందు వెళ్తున్న కారును, ఆ వెంటనే ఎదురుగా వస్తున్న స్కూటీని తర్వాత రైస్‌మిల్ ప్రహరీకి సంబంధించిన పిల్లర్‌ను ఢీకొని ఆగిపోయింది. డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ప్రమాదంలో అక్షిత లారీ చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతిచెందగా.. అనిత, వెంకటేశ్‌కు కాళ్లు, చేతులు విరిగాయి. సమాచారం అందుకున్న దుద్యాల పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను కోస్గి ఆస్పత్రికి, అటునుంచి మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్‌కు తరలించారు. చిన్నారి అక్షిత శరీర భాగాలను సేకరించేందుకు అంబులెన్స్ సిబ్బంది వెనకడుకు వేయగా చిన్నారి బంధువైన ఓ వ్యక్తి సాయంతో ఎస్ఐ స్వయంగా తీసి సంచిలో వేసి పోస్టుమార్టానికి పంపించారు. వరుసకు మామ అయిన శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ వివరించారు.



అక్షిత (ఫైల్)

గొర్రెను తీసుకొచ్చేందుకు వెళ్లి వ్యక్తి మృతి

ఖిల్లాఘనపురం: గొర్రెను తీసుకొచ్చేందుకు చెరువులోకి దిగి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఖిల్లాఘనపురం మండలం అప్పారెడ్డిపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం అప్పారెడ్డిపల్లికి చెందిన ఎరుకలి రాజు (32) అదే గ్రామానికి చెందిన నక్క వెంకటయ్య దగ్గర గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం గొర్రెలను స్నానం చేయించేందుకు మర్రి చెరువు వద్దకు తీసుకెళ్లాడు. ఓ గొర్రె ఈదుతూ చెరువు కట్ట వైపునకు వెళ్లింది. ఆ గొర్రె కోసం రాజు నీటిలో దిగి తీసుకొచ్చే క్రమంలో మూర్ఛ రావడంతో నీటిలో మునిగి చనిపోయాడు. వెంట వెళ్లిన వెంకటయ్య ఎంత వెతికినా రాజు ఆచూకీ లభించలేదు. దీంతో అధికారులకు సమాచారం అందించడంతో బుధవారం గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి రాజు మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్‌గౌడు తెలిపారు.



రాజు(ఫైల్)

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS SERVICES

- మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9389214214

CHANGE OF NAME

- I, Mohammed Abdul Tasleem S/o Mohammed Abdul Nayeem, R/o H-No:1-10-42, near Naser Masjid,Shah Saheb Gutta, Mahabubnagar town and Dist.Telangana., do hereby declare that my name MOHAMMED TASLEEM (old name) have changed to MOHAMMED ABDUL TASLEEM (new name) for all future, purposes.

WANTED

- MG కార్ షోరూం మహబూబ్‌నగర్‌లో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రిసెప్షనిస్టు, మెకానిక్‌లు కావలెను. సంప్రదించు సెల్ : 9491402020, 9482628629.
- రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No.1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషెంట్ల సేవ వంట/ఇంటిపని టేకేర్‌కై M/F వర్కర్స్ కా।। భో+వ+జీ: 16–18 వేలు. 9515119570, 9553461177

భవిత విద్యార్థుల కోసం

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తమకు లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్